# గదులు

ఈ గోడే మా యిద్దరి మధ్యనా ఉంది - !

కిటికీలోంచి చూస్తాను! తలుపులు తీసుకుని డాబా మీదకు వచ్చి చూస్తాను.

ఆమె శరీరం పసిమి! ఆ మోము పసిమి!! ఆ సన్నని మెడ పసిమి!!!

అందుమీద తాడు పచ్చటి పసిమి ఛాయ!

భరించరాని దుఃఖం నిలువెల్లా నిండుతుంది.

పిల్లలను ముస్తాబు చేస్తూనో... భర్తకు సేవలు చేస్తూనో ఉంటుంది.

ఎంత తృప్తి! ఎంత ఆనందం! - ఆమె మోములో!

ఎంత తీరని కోరిక! ఎంత నైరాశ్యం నా మనసులో!

గదిని ఆనుకునే వంటగది ఉంది. ముద్దు మూటగట్టే సామానుతో నిండుగా ఉంటుంది. ప్రతి డబ్బా....ప్రతి సీసా... ప్రతి పాత్రా.... సమస్తమూ గర్వంగా ఉంటాయి.

అందులో ప్రతి వస్తువూ ఆమెదేనట!

ప్రతి క్షణమూ ఆమె కోసం అవి సిద్ధంగా ఉంటాయట.

ఆ సామాన్లు చెప్పే కథలు వింటాను.

ఆ స్పర్శ పొందగలిగిన అదృష్టానికి అసూయ!! ఎన్నాళ్ళు యిలా??

ధైర్యంగా ఆమెను చూడలేను! భయం!! ఎందుకు? ఏమో!!

రహస్యంగా చూస్తాను! మరీ మరీ చూడాలని తపన....! ఏం లాభం?

ఆమెకు ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు.

పెద్దవాణ్ణి తయారుచేసి బడికి పంపేస్తుంది. వాడికే అన్ని విషయాలు తెలిసే జ్ఞానం ఉంది. వాడంటేనే భయం!

రెండవది ఆడపిల్ల. దానికి జడ వేయటానికి స్థిమితంగా కూర్చుంటుంది. అది గడుగ్గాయి! అటూ ఇటూ కదిలిపోతుంది. దాని ముందు మేత ఉండాలి. పాపిడి తీయించుకోదు! ఏదో కథ చెపుతుంటుంది. ఊ....కొడుతుందా పిల్ల. ఆ జుట్టులో సన్నని పొడవాటి వేళ్ళు....! ఆ

వేళ్ళు......! ఆ జుట్టు....! మళ్ళీ పరుగులు! వెనకాల పరుగెడుతుంది! గాలిలో గర్వంగా తేలిపోతున్నట్టుంది ఆ పరుగు! దృశ్యం చెదిరి పోతుంది. ఆమె కదిలి పోతుంది. ఆ క్షణం గాలిలో కలిసి పోతుంది. మరలా ఎప్పుడన్న ప్రశ్న మిగిలి పోతుంది.

ఆఖరుదీ ఆడపిల్లే! అది ఎప్పుడు ఏడుస్తుందా అని ఎదురు చూస్తాను. నా చెవులు రిక్కించుకుని వింటాను. ఆడినంతసేపూ ఆడి....ఒక్కమారుగా ఏడుపు లంకించుకుంటుంది. కిటికీ తలుపుల దగ్గరకు దూసుకుపోతాను. ఓరగా తెరుస్తాను. శరీరం రోమాంచమవుతుంది.

ఆమె ఎంత పనిలోవున్నా....దాన్ని ఒళ్ళోకి తీసుకుంటుంది. చక చకా జాకెట్ బటన్స్ విప్పుతుంది. దాని నోటికి అందిస్తుంది. ఆ నోట్లో యిరుక్కున్న పాల రొమ్మును చూస్తుంటే.... ఎంత తీరని ఆశ చెలరేగుతుంది?

ఆ గుంటకి నిజంగా ఆకలేనా! పెసరకాయల్లాంటి వేళ్ళతో వాటిని పట్టుకుని ఆడుకుంటుంది! ఆమె అటు తిరిగి మాడిపోతున్న ఏ ఉప్మా పోపులోనో నీళ్ళు పోస్తుంది. అది దాని నోట్లోంచి జారిపోతుంది.

కళ్ళప్పగించి చూస్తాను!

తీరని కోరికలు కన్నీరుగా కళ్ళని ఆక్రమించుకుంటాయి. భరించరాని జ్వాల నన్ను కాల్చి వేస్తున్నట్లవుతుంది. ఆమె నన్ను పలకరిస్తుందా? నాకా అవకాశ మిస్తుందా?

ఎంత పేరాశ! ఆమె ఆకాశం! నేను భూమి!

ఆ గొంతుక వింటూ...అపుడపుడు వెలువడే కూనిరాగాలు వింటూ..... ఆ గాజుల చప్పుడూ ....మట్టెల మ్రోతా వింటూ.... ఏం చేస్తుంటుందో ఊహించుకుంటూ....

ఎంతకాలం? ఎంతకాలం?

ఒక్కోసారి అతను గట్టిగా కేకలు వేస్తుంటాడు!

అసూయ ఆవహిస్తుంది.

ఎంతటి చనువూ...అధికారం ఉంటే కేకలు వెయ్యగలరు! ఆ 'అధికారం....చనువూ' నా కెక్కణ్ణుంచి లభిస్తాయి? తీరని కోరిక.....కనులను విడువని దృశ్యాలు. బ్రతుకంతా పీడకలలా....పట్టీ పట్టని నిద్ర!

కళ్ళు నొప్పులు! కండరాల నొప్పులు! అలసట!

బయట చీకటి.....నా మదిలోనూ..... యీ గదిలోనూ.....

వ్యాపించిన ఆరాటం! ఎక్కడో రెండు గంటలు మ్రోత!

నా ఆలోచనలనూ...... పట్టీ పట్టని నిద్రనూ.....కదిలిస్తూ.....కంటూ ఉండే స్వప్నాలు నిజమవుతున్నట్లు.....ఆ కిటికీ తలుపు మీద చప్పుడు....!

భ్రమా! వాస్తవమా? ఒళ్ళు గిల్లుకున్నాను. దిగ్గున లేచాను.

అక్కడే....ఆ కిటికీ తలుపుల మీదే చప్పుడు!

ఒక్క పెకనులో తలుపు తెరిచాను.

ఆమె!! రెండు చేతులూ ఊసల సందుల్లోంచి చాచింది. నా చేతులు అందుకుంది. మరు క్షణంలో ఆమె బావురుమంది!

ఆశ్చర్యం! ఉద్వేగం!

"ఏమండీ!"

మహాసముద్రాన్ని పీల్చివేసిన అగస్త్యుడిలా దుఃఖ ప్రవాహాన్ని మింగేసింది.

"ఉష్!" మాట్లాడ వద్దన్నట్లు సైగ చేసింది. పిల్లిలా అడుగులువేస్తూ గది గుమ్మం దగ్గరకు వెళ్ళింది. లోపలికి తొంగి చూసింది. భర్త నిద్ర పోతున్నాడో లేడోనని కాబోలు.

తిరిగి వచ్చింది.

జాకెట్లో చెయ్యి పెట్టింది. ఏదో కాగితం తీసింది.

కిటికీలోంచి చేయి జాపి మళ్ళా నా చెయ్యి పట్టుకుని కాగితాన్ని అరచేతిలో పెట్టి గుప్పిడి మూసివేస్తూ అంది:

"ఈ యింట్లో......ఈ యింట్లో ఉన్నవాళ్ళు మంచాళ్ళుకారు....! ఇంతుంటే అంతచేసి ఆయనతో చెప్తారు."

చేతులు వెనక్కి తీసుకొని జోడించింది. కళ్ళలో నీరు!

"ఇంట్లోంచి బయటకు వెళ్తే ఆయనకు తెలిసిపోతుంది....చంపేస్తారు....! ఇంటివారి రెండో అమ్మాయి! ఏం చెప్పమంటారు.......?" గొణుగుతున్నట్లు చెప్పుకు పోతోంది.

కొంచెంసేపు ఊరుకొంది.

నా నోరు పెగలలేదు.

" ఈ ఒక్క సాయం చేయండి! కవరులో పెట్టి యీ ఉత్తరం పోస్టు చేయండి! అడ్రస్ అందులోనే ఉంది. కవరుకి డబ్బులు......డబ్బులు......!? చేయరూ!"

అవాక్కయి నిలబడిపోయాను. ఆ గొంతులోని అభ్యర్థన!

మెరుపులా ఆమె మాయమయింది.

కొద్దిసేపు అలాగే నిలబడి...మూసుకున్న ఆ గది తలుపులను చూస్తూ.... నెమ్మదిగా కిటికీ రెక్కలు మూశాను.

జరిగినది వాస్తవమేనని చేతిలో కాగితాలు చెప్తున్నాయి. వాటిని చదవకూడదు! చదవాలనే అనిపిస్తోంది! చదవనా? చదవ....నా? చ.ద.వ.నా??

కోరిక నన్ను జయించింది. గొలికేసి నట్టున్న అక్షరాల వెనకే చూపులు పరిగెత్తాయి.

"మహారాజశ్రీ అమ్మగారికి నమస్కరించి మీ కుమార్తె అలివేలు మంగతాయారు రాయునది. ఆయనా, మీరూ దెబ్బలాడుకున్నారు. కూతురనయినా లేకుండా నన్ను ఒదిలేశారు. ఎలా రాయాలో తెలీటం లేదు. అమ్మా! నాకు బాగా ఏడుపు వచ్చేస్తోంది. మళ్ళీ నాకు నెల తప్పింది. ఆయనకి యిష్టం లేదు. దెబ్బలాడేశారు. గోషా ఆసుపత్రికి వెళ్ళి అబార్షను చేయించుకున్నాను. చాలా నీరసంగా ఉంటోంది. రెస్టు లేక చేసుకోలేకపోతున్నాను. చచ్చిపోయినా

బాగుండును. బతికుండీ ఈ పిల్లలకు పిసరంత చెయ్యలేక పోతున్నాను. ఇంటి వారి రెండో అమ్మాయి మరీ బరితెగించేస్తూంది. రోజూ ఆయన దగ్గరే ఉంటుంది. నాకు మనూరు రావాలనుంది. మీ అంతట మీరు అడిగితేనే పంపుతారు. మొన్న మళ్ళీ బట్ట ఎక్కువయిపోయింది. రిక్షాకు డబ్బులయినా లేవు. నడుచుకునే ఆస్పత్రికి వెళ్ళాను. చెప్పకుండా వెళ్ళానని తొడపాశాలు పెట్టారు. అందుకని అమ్మా! నాకు ఎవరున్నారు? మీరయినా దయ చూపించండి. ఎలాగయినా నువ్వు నాన్నగారిని బతిమిలాడి పంపాలి.

"నేను ఉత్తరం రాసానని చెప్పొద్దు. చూడటానికే వచ్చానని చెప్పాలి. మంచిగా బతిమిలాడితే ఆయన పంపుతారు. నాన్నగారిని ఎలాగయినా పంపించాలి అమ్మా! భయం వేస్తోంది. నాన్నగారికి నమస్కారములు. తమ్ముళ్ళకూ, చెల్లాయిలకూ దీవనలు. పిల్లలూ, ఆయనా కులాసాగా ఉన్నారు...."

చదవటం పూర్తయింది. మరొకరి కోసం చాలా కాలానికి కళ్ళు తడి దేరాయి.

చుట్టూ కలయ జూశాను.

మంచం మీద మల్లెలు! నలిగి పోయిన మల్లెలు !!

నాతో బాటు పది మంది కింద నలిగిన మల్లెలు!!!

అయితేనేం?

వాటిని కొనటానికో పావలా డబ్బులూ, కొనుక్కునే స్వతంత్రమూ అయినా నాకున్నాయి!

అక్కడ ఆ గోడకు అవతల ఆ గదిలో మంచం మీద మల్లెలు! ఒకరి కిందే నలిగినా ఆమెకు???

నేనుంటున్నది గదే? బందిఖానాయే!

ఆమె ఉంటున్నదీ గదేనా? అదీ గదేనా?

రెండూ గదులే....నా??

రెండూ గదులే!!

★ (ప్రభవ మాస పత్రికః సెప్టెంబర్ 1978). ★